నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 25 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

## సామూహిక సెలవులో ఎంసీహెచ్ డాక్టర్లు

- కలెక్టర్ హామీతో వెనక్కి తీసుకున్న వైద్యులు.
- షోకాజ్ నోటీసులు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశాలు

నీలగిరి, ఆగస్టు 24 : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎంసీహెచ్ విభాగంలోని గైనకాలజిస్ట్‌లు శనివారం సామూహికంగా సెలవు పెట్టారు. శుక్రవారం తెల్లవారుజామున కుర్చీలో గర్భిణి డెలివరీ అయిన ఘటనకు సంబంధించి డాక్టర్లు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ అయిన విషయం తెలిసిందే. తమకు సంబంధం లేకున్నా బాధ్యులను చేయడం బాధాకరమంటూ ఎంసీహెచ్‌లోని డాక్టర్లు, సిబ్బంది సామూహిక సెలవు పెట్టారు. పని ఒత్తిడితోపాటు వేధింపులు, సంబంధంలేని ఘటనలకు బాధ్యులను చేస్తూ షోకాజ్ నోటీసులు ఇస్తున్న పరిస్థితుల్లో పని చేయలేమని సెలవు పత్రాలను గైనకాలజీ హెచ్‌ఓడీ స్వరూపారాణికి అందజేశారు. ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ నారాయణరెడ్డి రోగులకు ఇబ్బందులు కలుగవద్దని విధులకు హాజరు కావాలని సూచించారు. అయినా.. డాక్టర్లు ఒప్పుకోకపోవడంతో షోకాజ్ నోటీసులను నిలిపివేస్తామని, సోమవారం ఆసుపత్రికి వచ్చి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దాంతో డాక్టర్లు సెలవులను వెనక్కి తీసుకొని విధుల్లో చేరారు. అనంతరం వారికి మద్దతుగా మిగతా విభాగాల వైద్యులు, సిబ్బంది సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

## గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 24 : జిల్లాలో ఈ నెల 27, 29 తేదీల్లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటించనున్నారని, అందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జిల్లా అధికారులతో సమావేశమై గవర్నర్ పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. గవర్నర్ ఈ నెల 27న ఉదయం 8గంటలకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారని, అనంతరం ములుగు, వరంగల్, జనగాం జిల్లాల పర్యటనకు వెళ్తారని తెలిపారు. 29న మధ్యాహ్నం 2:20 గంటలకు ఆలేరులోని జైన, సోమేశ్వర ఆలయాలను, సాయంత్రం 3:30 గంటలకు భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శించుకుంటారని చెప్పారు. సాయంత్రం 4:15 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులను, 5:15 గంటలకు రచయితలు, కళాకారులు, ప్రముఖులు, రాష్ట్ర జాతీయ అవార్డు గ్రహీతలను కలుస్తారని తెలిపారు. జిల్లా అధికారులు తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించి గవర్నర్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.గంగాధర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రుణమాఫీ గ్రీవెన్స్‌కు రైతుల క్యూ

## మాఫీకాని రైతుల ప్రదక్షిణలు

- వ్యవసాయశాఖ ఆఫీసుల్లో దరఖాస్తులతో బారులు
- నల్లగొండ జిల్లాలో 6 వేలకు పైగా అర్జీలు
- మండలాల్లో ఏఈఓలకు అందజేత
- లోన్ అకౌంట్ స్టేట్‌మెంట్ కోసం బ్యాంకుల్లో నిరీక్షణ
- సర్కారు తీరుపై అన్నదాతల ఆగ్రహం
- వ్యవసాయ పనుల సీజన్‌లో ఇలా తిప్పడం న్యాయమేనా అని ఆవేదన

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ రుణాలకు సంబంధించిన 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీల మీద కొర్రీలు పెట్టడంతో అర్హుల్లో సగం మంది రుణమాఫీకి దూరమైన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు కాంగ్రెస్ పెద్దలు ఇచ్చిన హామీ ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 6లక్షల మంది రుణమాఫీకి అర్హులుగా రైతులు ఉంటారన్నది అంచనా. కానీ రేషన్‌కార్డు ప్రమాణికంగా కుటుంబానికి గరిష్టంగా 2లక్షల రుణమాఫీని వర్తింప చేయడం వల్ల చాలా మందికి మాఫీ కాలేదు. ప్రభుత్వం లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 3.39లక్షల మంది రైతులకే రుణమాఫీ అయ్యింది. దాంతో మరో రెండున్నర లక్షల మందికి పైగా రైతులు రుణమాఫీ కాక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వారంతా తమకు రుణమాఫీ ఎందుకు కాలేదంటూ వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ రోజూ ప్రదక్షిణ చేస్తున్నారు. కాగా, రుణమాఫీ తొలిదశలోనే సగం మంది రైతులకు మాఫీ జరుగలేదన్న విమర్శల నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత దశల వారీగా మండల వ్యవసాయ శాఖ కార్యాలయాల్లోనూ గ్రీవెన్స్ సెల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. అన్నిచోట్లా ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆధార్ నెంబర్ ఆధారంగా కొందరికి ఎందుకు రుణమాఫీ కాలేదో అధికారులు తెలియజేస్తున్నా... తదుపరి ఏం చేయాలనే దానిపై మాత్రం స్పష్టత కరువైంది. ఇప్పటివరకు ఒక్క నల్లగొండ జిల్లాలోనే ఆరు వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు.



యాదగిరిగుట్ట సీఐకి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య

### మాఫీ కోసం రైతుల ప్రదక్షిణలు

రుణమాఫీ కొర్రీలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండడంతోపాటు రైతులు రోడ్డెక్కుతుండడంతో ప్రభుత్వం నష్ట నివారణ చర్యలకు ఆదేశించింది. రుణ మాఫీ కాని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను కలిసి మరోసారి తమ ధ్రువీకరణ పత్రాలు అందించాలని సూచించింది. దాంతో రుణమాఫీకి దూరమైన రైతులంతా వారం నుంచి అదే పనిలో ఉన్నారు. రెండు లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు మరోసారి తమ పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు లోన్ అకౌంట్ తాజా స్టేట్‌మెంట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌తోపాటు ఒక దరఖాస్తు ఫారమ్‌ను నింపి మండలాల్లోని ఏఈఓలకు అందిస్తున్నారు. లోన్ స్టేట్‌మెంట్ కోసం ముందుగా బ్యాంకుల చుట్టూ తిరుగాల్సి వస్తున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆత్మకూర్.ఎం వంటి చోట్ల బ్యాంకర్లు రైతులకు టోకెన్లు ఇచ్చి రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే అవకాశం ఇస్తున్నారు. ఆ తర్వాత సంబంధిత నమూనాలో దరఖాస్తులు అందజేస్తున్నా ప్రభుత్వ తదుపరి ఉత్తర్వుల ప్రకారమే రుణ మాఫీ జరుగుతుందని అధికారులు చెప్తుండడం గమనార్హం. రేషన్‌కార్డు లేక రుణమాఫీకి దూరంగా ఉన్న రైతులు కూడా ఇదే తరహాలో తమకు రేషన్ కార్డు లేదన్న విషయాన్ని తెలియజేస్తూ దరఖాస్తులు సమర్పిస్తున్నారు. దాంతోపాటు ఒకే రేషన్ కార్డులో ఉన్న వారి కుటుంబాల్లోనూ రూ.2లక్షలకు పైగా లోన్ ఉంటే వారికి రుణ మాఫీ కాలేదు. వారితోపాటు ఆధార్ నెంబర్‌లో లేదా బ్యాంకు అకౌంట్ నెంబర్‌లో తప్పు ఎంట్రీ ఉన్న వారికి రుణ మాఫీ కాలేదు. ఇలాంటి అనేక కారణాలతో రుణమాఫీకి దూరంగా ఉన్న రైతులంతా ప్రస్తుతం అధికారులు, బ్యాంకుల చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తున్నది. శనివారం నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం వద్ద గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన రైతులు భేషరతుగా అందరికీ రుణమాఫీ చేయాలని నినాదాలు చేశారు.

### భారీగా వినతుల వెల్లువ

ఒక్క నల్లగొండ జిల్లాలోనే శనివారం నాటికి 6వేలకు పైగా రుణమాఫీ కోసం రైతుల నుంచి వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం నాటికి 5,840 దరఖాస్తులు రాగా, శనివారం నాటి వివరాలు అప్‌డేట్ కావాల్సి ఉందన్నారు. అందులో కుటుంబ సభ్యుల వివరాలకు సంబంధించిన దరఖాస్తులు 1,821, రూ.2లక్షలకు పైగా రుణం ఉన్న వాటిపై 745, నో డేటా అని చూపిన ఖాతాలపై 1,554, ఆధార్ నెంబర్ తప్పుగా ఉన్న ఖాతాలపై 234, పేర్లు సరిపోలని వాటిపై 429, బ్యాంకు వివరాలపై 37, సహకార సంఘాల్లోని వాటిపై 105, పాస్‌పుస్తకాలకు సంబంధించి 467, డెబిట్ సమస్యలపై 154, ఇతర కారణాల మీద 294 దరఖాస్తులు శుక్రవారం నాటికి వ్యవసాయ శాఖకు అందాయి. వీటన్నింటినీ స్క్రూటినీ చేస్తూ తప్పొప్పులను సరిచేసి ఆ వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు వెల్లడించారు. ఇవన్నీ ఎలా ఉన్నా గతంలో కేసీఆర్ సర్కారు మాదిరిగా భేషరతుగా రుణ మాఫీని వర్తింప చేస్తే ఈ అవస్థలు ఉండవు కదా అని రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో తమను ఇలా బ్యాంకుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిప్పడం న్యాయమేనా అని ప్రశ్నిస్తున్నారు.



నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఖాతాలను చెక్ చేసుకుంటున్న రైతులు

### ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వం



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మీద లేదు. రుణమాఫీ అందరికీ అన్నారు. నాకు మాఫీ కాలేదు. నాకు 38 గుంటల భూమి ఉంది. దాని మీద రూ.52 వేలు పంట రుణం తీసుకున్న. మొదటి విడుత లక్ష లోపు జాబితాలోనే నాకు మాఫీ కావాలి. కాకపోవడంతో బ్యాంకు వెళ్లి అడిగితే రెండో విడుతలో అవుతుందన్నారు. తర్వాత మూడో విడుత అన్నారు. ఏ విడుతలోనూ మాఫీ కాలేదు. పట్టుబట్టి బ్యాంకులో గట్టిగా అడిగితే ఆధార్‌లోని పేరు, ఖాతాలోని పేరు వేరుగా ఉందని. అందుకే రుణ మాఫీ కాలేదని చెప్పారు. ఇది తెలుసుకునేందుకే చాలాసార్లు తిరుగాల్సి వచ్చింది. మళ్లీ అన్ని పత్రాలు ఇచ్చి రుణమాఫీకి కోసం తిరుగుతున్న. పని వదులుకుని ఇట్లా తిరుగడానికే సరిపోతున్నది.

-బాసాని ఉర్మిళ, రైతు, అమ్మనబోలు

### ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి



నాకు రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్న. ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంటే దానిపై బ్యాంక్ ఆఫ్ బరోడాలో 75 వేలు, గ్రామీణ బ్యాంకులో లక్షా 90వేలు రుణం పొందాను. ఏ బ్యాంకులోనూ నాకు రుణమాఫీ కాలేదు. ఇదేంటని బ్యాంకు సిబ్బందిని అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. వ్యవసాయాధికారులను అడిగితే రెండు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే మాఫీ కాదంటున్నారు. ఒక బ్యాంకులోని రుణం మొత్తం కడితే వర్తిస్తుందని చెప్తే బ్యాంక్ ఆఫ్ బరోడాలో తీసుకున్న అప్పు వడ్డీసహా కట్టిన. ఈ విషయం వ్యవసాయ అధికారులకు తెలుపగా త్వరలో రూ.1లక్షా 90వేలు మాఫీ అవుతాయంటున్నారు. దీని కోసం ఇంకెన్ని సార్లు తిరగాలో అర్థమైతలేదు.

-గోదల వెంకట్‌రెడ్డి, రైతు, నార్కట్‌పల్లి గ్రామం

## రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి

- కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- యాదగిరిగుట్ట నర్సన్నపై ఒట్టు వేసి విశ్వాసాలను దెబ్బ తీశారు
- రాష్ట్రానికి చెడు జరిగే విధంగా సీఎం చర్యలు
- పోలీస్ స్టేషన్లలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతుల ఫిర్యాదు

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడి వ్యవహార శైలిపై రైతుల్లో ఆగ్రహం వెల్లువెత్తుతున్నది. అర్హులందరికీ రుణ మాఫీ చేయకపోవడంతో ఆక్రోశం వ్యక్తమవుతున్నది. రుణమాఫీపై మాట ఇచ్చి మోసం చేసిన రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు, బీఆర్‌ఎస్ నేతలు శనివారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. భువనగిరి, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, మోటకొండూరు, బొమ్మలరామారం పోలీస్ స్టేషన్లలో కంప్లయింట్ ఇచ్చారు. భువనగిరిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగాం పాండు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ కిరణ్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, యాదగిరిగుట్టలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మోటకొండూరులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్య ఆధ్వర్యంలో ఫిర్యాదులు అందించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో భువనగిరిలో జరిగిన కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టు వేసి అమలు చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్వామివారిపై ప్రమాణం చేసి, ప్రజలందరి మనోభావాలు దెబ్బతీశారని మండిపడ్డారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిపై ఒట్టు వేసి, రాష్ట్రానికి కీడు జరిగేలా చేశారని, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# పెద్దకొండూర్ సగం మందికే రుణ మాఫీ

చౌటుప్పల్, ఆగస్టు 23 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీపై గందరగోళం నడుస్తున్నది. ఇప్పటికీ సగం మందికి కూడా మాఫీ కాలేదని చౌటుప్పల్ మండల పరిధిలోని పెద్దకొండూర్ గ్రామస్తులు భగ్గుమంటున్నారు. గ్రామంలో సుమారు 300మంది రైతులు పంట రుణాలు తీసుకుంటే దాదావుగా సగం మందికే మాఫీ అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెప్పింది ఒకటి చేసింది మరొకటి అని గరంగరం అవుతున్నారు. ‘2023 సంవత్సరంలో మాకు రుణమాఫీ అయ్యింది. ఆ తర్వాత బ్యాంకు వాళ్లు రెన్యూవల్ చేయమంటే చేయలే. తర్వాత ఇస్తామని చెప్పింండ్రు. రెండు నెలలకు పోతే రుణం ఇచ్చింండ్రు. ఇప్పుడు రుణ మాఫీ కటాఫ్ డేట్ దాటిన తర్వాత రెన్యూవల్ చేసినవు, రావని బ్యాంకు వాళ్లు చెప్తున్నారు’ అని గ్రామానికి చెందిన జక్కిడి రాంనర్సమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.



పెద్దకొండూర్ పంట పొలాలు

### రేషన్ కార్డు కొర్రీ పెట్టి మాఫీ చేయలే..



నా భార్య, నేను కలిసి రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగా రుణమాఫీ చేస్తమన్నరు. ఇప్పుడు రేషన్ కార్డు కొర్రి పెట్టింండ్రు. మళ్లీ కుటుంబంలో రూ.2లక్షల పైగా ఉన్నోళ్లకు పైన ఉన్న నగదు జమ చేయాలని చెబుతున్నరు. బ్యాంక్ అధికారులు మాకు ఎలాంటి ఇన్‌స్ట్రక్షన్ రాలేదని అంటున్నరు. ఏదీ సక్కగా చెప్పడం లేదు. రైతులను ఇబ్బంది పెడుతున్నరు.

-కాయితి యాదయ్య గౌడ్, రైతు, పెద్దకొండూర్

### ఇంకా ఎన్ని రోజులు ఆఫీసుల వెంబడి తిరుగాలె



నాకున్న 5.20గుంటల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. 2016లో ఆంధ్రా బ్యాంక్‌లో రూ.1.50లక్షల పంట రుణం తీసుకున్న. ఇప్పటి వరకు ఏటా క్రమం తప్పకుండా రెన్యూవల్ చేసుకుంటూ వచ్చిన. నా పేరు మాఫీ జాబితాలో రాలేదు. రోజూ బ్యాంక్ చుట్టూ తిరుగుతున్న. అక్కడికి పోతే వ్యవసాయ అధికారులను కలువమంటున్నరు. ఇంకా ఎన్ని రోజులు ఆఫీసుల వెంబడి తిరగాలే. వ్యవసాయ పనులు వెనుకబడి పోతున్నవి. ప్రభుత్వానికి రైతుల గోస వినిపించడం లేదు.

-యంపాల కొండల్ రెడ్డి, రైతు, పెద్దకొండూర్



తడి చెత్తను కుళ్లేవిధంగా చేసిన విధానాన్ని తెలుసుకుంటున్న విదేశీయులు

## భువనగిరి మున్సిపాలిటీని సందర్శించిన విదేశీయుల బృందం

భువనగిరి అర్బన్, ఆగస్టు 24 : భువనగిరి మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డును భూటాన్, కెమరాన్, ఇథోపియా, గ్యాంబియా, కెన్యా, మడగాస్కర్, నేపాల్, పాలస్తీనా, పనామా, సౌత్‌సుడన్, శ్రీలంక, తునీషియా, ఉబెకిస్థాన్‌తోపాటు 17 దేశాలకు చెందిన ప్రతినిధులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని మానవ మల వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో సెప్టిక్ ట్యాంకుల నుంచి తీసుకొచ్చిన వర్థాన్ని నీరుగా మార్చి డంపింగ్ యార్డులోని చెట్లకు వాడే విధానాన్ని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి వివరించారు. వాల్కనైజర్ మిషన్ ద్వారా తడి, పొడి చెత్తను వేరు చేయుట, తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువుగా మార్చే విధానం, పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం విక్రయించడాన్ని తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విదేశీ ప్రతినిధులు మాట్లాడుతూ వ్యర్థ పదార్థాల నిర్వహణలో తమ దేశాల కంటే భారతదేశం ముందంజలో ఉందన్నారు. క్షేత్ర పరిశీలనలో గ్రహించిన అంశాలను తమ దేశాల్లో అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

అంతకుముందు కలెక్టర్ హనుమంతు కె.జెండగే, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విదేశీయులకు స్వాగతం పలికి పూల మొక్కలు అందజేశారు. అనంతరం వారిని మున్సిపాలిటీ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి పొన్నం, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు స్వీకరిస్తున్న వీవీ రెడ్డి

## దేవరకొండ ఆర్టీసీ డ్రైవర్లకు ఉత్తమ అవార్డులు

దేవరకొండ రూరల్, ఆగస్టు 24 : ప్రతి సంవత్సరం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉద్యోగులకు అందించే ప్రగతి చక్రం పురస్కారాల్లో భాగంగా దేవరకొండ డిపోకు రెండు అవార్డులు వచ్చాయి. డిపోకు చెందిన డ్రైవర్ వడ్డపల్లి వెంకట్‌రెడ్డి, అద్దె బస్సు డ్రైవరు నెహ్రూకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్‌లో అవార్డుతోపాటు రూ.51వేల నగదు, ప్రశంసా పత్రం అందజేశారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలుగుతూ వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గానూ వారికి ఈ అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు డిపో మేనేజర్ రమేశ్‌బాబు, తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

## నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు తప్పవు

- ఎస్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్



గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

మిర్యాలగూడ, ఆగస్టు 24 : గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని ఎస్టీ వెల్ఫేర్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ అన్నారు. మండలంలోని అవంతీపురం గిరిజన గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు హాజరు కాకపోవడం, రికార్డ్ మెయింటెనెన్స్ సరిగా చేయకపోవడంతో ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డైనింగ్ హాల్‌ను చూసి అసహనానికి గురయ్యారు. విద్యార్థులకు మెనూ పాటించకుండా నాసిరకం భోజనం అందిస్తుండడం పట్ల సిబ్బందిని మందలించారు. విద్యార్థులకు తప్పనిసరిగా తాజా కూరగాయలతో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. నాసిరకం కూరగాయలు పంపిణీ చేస్తున్న విషయంపై జేసీకి రిపోర్ట్ చేయాలన్నారు. ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్‌సీఓ అగస్టీన్ ఉన్నారు.